# 46. అల్ అహ్‌ఖాఫ్ (ఇసుక మేటల దారి) సూరా

## పరిచయం

ఈ సూరా మక్కా కాలానికి చెందినది. ఇందులో 35 ఆయతులు ఉన్నాయి. ఏకదైవారాధన, దైవవాణి అవతరణ, మరణించిన తర్వాత మళ్ళీ లేపబడడం, శిక్షా బహుమానాల గురించి ఈ సూరా ప్రధానంగా నొక్కి చెప్పింది. ఇందులోని 21వ ఆయతులో ఇసుకమేటల దారి గురించిన ప్రస్తావన ఉంది. దక్షిణ అరేబియాలోని ఆద్ జాతి నివసించిన ప్రాంతంలో ఈ ప్రదేశం ఉంది. ఆద్ జాతి ప్రజలు చాలా బలమైన వారు. వారు చాలా పొడవుగా బలిష్టంగా ఉండేవారు. అద్భుతమైన భవనాలు నిర్మించేవారు. వారికి ప్రకృతి వనరులు పుష్కలంగా ఉండేవి. సారవంతమైన నేలలు ఉండేవి. గొప్ప నీటిపారుదల వ్యవస్థ ఉండేది. ఆ విధంగా వారు ఆధిపత్యాన్ని పొందారు. సంపన్న జాతిగా మారారు. కాని వారి సంపద వారిని సత్యానికి దూరం చేసింది. అణచివేత వారి నిత్యకృత్యమయ్యింది. వారి వద్ద ప్రవక్తగా పంపబడిన హూద్(అస) వారిని హెచ్చరించారు. అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం మహాపరాధమని చెప్పారు. సత్యాన్ని తిరస్కరించడం, అణచివేతకు పాల్పడడం మంచిది కాదని బోధించారు. కాని వారు ఆయన మాటలను పెడచెవిన పెట్టారు. ఫలితంగా వారు నాశనానికి గురయ్యారు. ఒక తీవ్రమైన ఇసుకతుఫాను వారిని ముంచేసింది. వారి ఇళ్ళ శిథిలాలు మాత్రమే మిగిలాయి. ధార్మిక విశ్వాసాన్ని తిరస్కరించేవారికి, దైవవాణిని నిరాకరించే వారికి ఇది ఒక గుణపాఠంగా మిగిలిపోయింది.

ఈ సూరాలో తల్లిదండ్రుల పట్ల దయతో, ప్రేమతో వ్యవహరించే విశ్వాసి గురించి, తల్లిదండ్రుల పట్ల కఠినంగా, నిర్దయగా వ్యవహరించే అవిశ్వాసి గురించి వేర్వేరుగా ప్రస్తావించి వారి మధ్య భేదాన్ని తెలియజేయడం జరిగింది. గర్భధారణ సందర్భంగా, ప్రసవం సందర్భంగా తల్లి పడే వేదనను ఇక్కడ గుర్తుచేయడం జరిగింది. శిశువుకు పాలుపట్టే గరిష్ట కాలం 24 నెలలని ఇక్కడ తల్లులకు చెప్పడం కూడా జరిగింది.

## 46. అల్ అహ్ఖాఫ్ సూరా

అవతరణ : మక్కా ఆయతులు :35

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

**1** హా – మీమ్.[1]

**2** ఈ గ్రంథావతరణ సర్వాధిక్యుడు, వివేకవంతుడైన అల్లాహ్ తరఫున జరిగింది.

**3** మేము భూమ్యాకాశాలను, వాటి మధ్యనున్న వస్తువులన్నింటినీ సత్య (ప్రణాళికా) బద్ధంగా ఒక నిర్ణీత గడువు కొరకు సృష్టించాము.[2] కాని అవిశ్వాసులు తాము హెచ్చరించబడే విషయం నుండి ముఖం తిప్పుకుంటున్నారు.[3]

**4** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "చూడండి! మీరు అల్లాహ్‌ను వదలి ఎవరెవరిని పూజిస్తున్నారో వారు భూమండలంలో ఏ భాగాన్ని సృష్టించారో కాస్త నాకు

## سُوْرَةُ الْاَحْقَافِ

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

حٰمٓ ①

تَنْزِيْلُ الْكِتٰبِ مِنَ اللّٰهِ الْعَزِيْزِ الْحَكِيْمِ ②

مَا خَلَقْنَا السَّمٰوٰتِ وَالْاَرْضَ وَمَا بَيْنَهُمَآ اِلَّا بِالْحَقِّ وَاَجَلٍ مُّسَمًّى ۭ وَالَّذِيْنَ كَفَرُوْا عَمَّآ اُنْذِرُوْا مُعْرِضُوْنَ ③

قُلْ اَرَءَيْتُمْ مَّا تَدْعُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ اَرُوْنِيْ مَاذَا خَلَقُوْا

---

1. ఇలాంటి **'ముతషాబిహాత్'** (అస్పష్ట) వాక్యాలు దివ్యఖుర్ఆన్‌లో అనేకం ఉన్నాయి. దీని అర్థం అల్లాహ్‌కే తెలుసు. కాబట్టి మనం దీనిపై అదేపనిగా మల్లగుల్లాలు పడవలసిన, కూపీలు లాగవలసిన పనిలేదు. కాకపోతే దీనివల్ల రెండు ప్రయోజనాలున్నాయని కొంతమంది ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు పేర్కొన్నారు. వాటిని మేము లుఖ్మాన్ సూరా మొదటి ఆయతు క్రింద ప్రస్తావించటం జరిగింది.
2. అంటే భూమ్యాకాశాల సృష్టి వెనుక ఒక ముఖ్య ఉద్దేశం ఉన్నది. అదే మానవుని పరీక్ష. అదీగాక దీనికి ఒక గడువు కూడా నిర్ధారితమై ఉంది. ఆ ప్రళయ ఘడియ సంభవించినప్పుడు భూమ్యాకాశాల ఈ వ్యవస్థ అంతా అతలాకుతలమైపోతుంది. అప్పుడు భూమి ఈ భూమిగా ఉండదు. ఆకాశం ఈ ఆకాశంగా ఉండదు. "భూమ్యాకాశాల రూపురేఖలు పూర్తిగా మార్చివేయబడే రోజు (గురించి నువ్వు వారికి హెచ్చరించు)" (ఇబ్రాహీమ్ – 48).
3. అంటే – విశ్వాస రాహిత్యం కారణంగా వారు పునరుత్థాన దినం, లెక్కల దినం, తీర్పుదినం లాంటి మాటల్ని పెడచెవిన పెడుతున్నారు. అసలు మాటనే శ్రద్ధగా వినని వారు ఇంక ఆ దినానికి ఎలా భయపడతారు?

مِّنَ الْأَرْضِ أَمْ لَهُمْ شِرْكٌ فِي السَّمَاوَاتِ ۖ ائْتُونِي بِكِتَابٍ مِّن
قَبْلِ هَٰذَا أَوْ أَثَارَةٍ مِّنْ عِلْمٍ إِن كُنتُمْ صَادِقِينَ ④

చూపుతారా?[4] పోనీ, ఆకాశాలలో అయినా వారికేదన్నా వాటా ఉన్నదా?! మీరు సత్యవంతులే అయితే (ఆ మేరకు) దీనికి మునుపు వచ్చిన ఏదైనా గ్రంథం గానీ, లేక ఉల్లేఖించబడే ఏదయినా జ్ఞానాన్ని గాని నావద్దకు తీసుకురండి.[5]

وَمَنْ أَضَلُّ مِمَّن يَدْعُو مِن دُونِ اللَّهِ مَن لَّا يَسْتَجِيبُ
لَهُ إِلَىٰ يَوْمِ الْقِيَامَةِ وَهُمْ عَن دُعَائِهِمْ غَافِلُونَ ⑤

**5** అల్లాహ్‌ను వదలి ప్రళయదినం వరకూ తన మొరను ఆమోదించలేని వారిని, పైగా తను మొరపెట్టుకున్న సంగతి కూడా తెలియని వారిని మొరపెట్టుకునేవానికన్నా పెద్ద మార్గభ్రష్టుడు ఎవడుంటాడు?[6]

وَإِذَا حُشِرَ النَّاسُ كَانُوا لَهُمْ أَعْدَاءً وَكَانُوا بِعِبَادَتِهِمْ
كَافِرِينَ ⑥

**6** మానవులంతా సమీకరించబడినపుడు వారు వారికి (తమ భక్తులకు) శత్రువులై పోతారు. వీళ్ల పూజాపునస్కారాలను కూడా వాళ్లు త్రోసిపుచ్చుతారు.[7]

4. అంటే మీరు అల్లాహ్‌ను కాదని ఏ విగ్రహాలను పూజిస్తున్నారో లేక ఏ స్వాములను సేవిస్తున్నారో వారంతా కలసి భూమ్యాకాశాలలో ఏం సృష్టించారో చెప్పండి?! భూమ్యాకాశాల నిర్మాణంలో వారికేదన్నా పాత్ర ఉందా? ముమ్మాటికీ లేదు. మరలాంటప్పుడు మీరు ఆ మిథ్యా దైవాలను అల్లాహ్‌కు సహవర్తులుగా ఎందుకు నిలబెడుతున్నారు? వారి ముందు ఎందుకు తలలు వంచుతున్నారు?

5. లోగడ ఏ ప్రవక్తపైనయినా అవతరించిన గ్రంథంలోగానీ, లేక ఏదైనా ప్రామాణిక ప్రవచనంలోగానీ దీనికి సంబంధించిన ఆధారం ఉంటే తెచ్చి చూపండి. మూలంలో **'అసారతిమ్ మిన్ ఇల్మిన్'** ( أَثَارَةٍ مِّنْ عِلْمٍ ) అని ఉంది. అంటే స్పష్టమైన జ్ఞాన సూచన అని అర్థం. ప్రామాణిక పద్ధతిలో ఉల్లేఖించబడిన గత ప్రవక్తల ప్రబోధనా అవశేషం అన్న అర్థం కూడా వస్తుంది.

6. అంటే – వీళ్లే అందరికన్నా పెద్ద మార్గభ్రష్టులు. ఎందుకంటే వీళ్లు రాతి విగ్రహాలను, చనిపోయిన వ్యక్తులను మొరపెట్టుకుంటున్నారు. వారెన్నటికీ వారి మొరలను ఆలకించలేరు. ప్రళయదినం వరకూ వారి మొరలకు సమాధానం ఇవ్వలేరు. తమ భక్తులు తమను మొరపెట్టుకున్నారన్న సంగతి కూడా వారికి తెలీదు.

7. ఈ అంశం దివ్య ఖుర్‌ఆన్‌లో ఎన్నో చోట్ల వచ్చింది. ఉదాహరణకు : యూనుస్

وَإِذَا تُتْلَىٰ عَلَيْهِمْ آيَاتُنَا بَيِّنَاتٍ قَالَ الَّذِينَ كَفَرُوا لِلْحَقِّ لَمَّا جَاءَهُمْ هَٰذَا سِحْرٌ مُّبِينٌ ﴿٧﴾

**7** స్పష్టమైన మా వాక్యాలను వారికి చదివి వినిపించినప్పుడు, తమ వద్దకు వచ్చేసిన సత్యాన్నుద్దేశించి ఈ తిరస్కారులు, "ఇదొక పచ్చి ఇంద్రజాలం" అంటారు.

أَمْ يَقُولُونَ افْتَرَاهُ ۖ قُلْ إِنِ افْتَرَيْتُهُ فَلَا تَمْلِكُونَ لِي مِنَ اللَّهِ شَيْئًا ۖ هُوَ أَعْلَمُ بِمَا تُفِيضُونَ فِيهِ ۖ كَفَىٰ بِهِ

**8** ఏమిటి, "అతనే (ప్రవక్తే) స్వయంగా దీన్ని కల్పించాడ"ని[8] వారంటున్నారా? (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "ఒకవేళ నేనే దీన్ని స్వయంగా కల్పించుకుని ఉంటే, మీరు అల్లాహ్ సమక్షంలో నాకు ఏవిధంగానూ తోడ్పడలేరు.[9] మీరు దీని (ఖుర్ఆన్)

సూరా (29)లోనూ, మర్యమ్ సూరా (81, 82) లోనూ, అన్‌కబూత్ సూరా (25) లోనూ చూడండి. ఇహలోకంలో ఇలాంటి ఆరాధ్య దైవాలు రెండు రకాలు. మొదటి రకం : చెట్టు పుట్టలు, రాళ్లు రప్పలు. సూర్యచంద్రులు, అగ్ని మొదలగునవి. ఆనాడు అల్లాహ్ వారికి మాట్లాడేశక్తిని ప్రసాదిస్తాడు. అప్పుడు వారంతా (ఆ వస్తువులన్నీ) వారికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయి. వాళ్లు తమను పూజించిన సంగతి తమకస్సలు తెలియదని అంటాయి. ఇక వారి ఆరాధ్య దైవాలలోని రెండవ వర్గం దైవప్రవక్తలది, దైవదూతలది, సజ్జనులది. ఉదాహరణకు : హజ్రత్ ఉజైర్, హజ్రత్ ఈసా (అలైహిముస్సలాం) మరియు ఇతర పుణ్య పురుషులన్నమాట. వారంతా దైవసమక్షంలో తమను పూజించిన వారికి వ్యతిరేకంగా సాక్ష్యమిస్తారు. ఈసా (అలైహిస్సలాం) ఎలా ప్రసంగించారో దివ్య ఖుర్ఆన్‌లో ఒక చోట ఉదాహరించబడింది కూడా. ఆఖరికి షైతానులు కూడా నిరాకరిస్తారు. వారిలా అంటారు : "వారికి సంబంధించిన బాధ్యత మాపై లేదని మేము నీ సమక్షంలో ప్రకటిస్తున్నాము. అసలు వారు మమ్మల్ని పూజించనే లేదు" (అల్ ఖసస్ – 63).

8. వారివద్దకు వచ్చేసిన ఆ సత్యం ఏది? అంటే అదే ఖుర్ఆన్. ఖుర్ఆన్ మహత్యాన్ని, దాని బోధనా తీరును చూసి వారు అమితంగా ప్రభావితులయ్యారు. కాని వాస్తవాన్ని ఒప్పుకోవటానికి అహం అడ్డుపడింది. అందుకే దాన్నొక ఇంద్రజాలంగా చిత్రీకరించారు. ఆ పాచిక కూడా పారకపోవటంతో, ఆఖరికి దాన్ని ముహమ్మద్ (సఅసం) అల్లిన కట్టుకథగా అభివర్ణించారు.

9. అంటే – నేను దైవప్రవక్తను కాననే, నేను వినిపించే ఈ వాణి నా స్వీయకల్పనే అన్న మీ వాదనే గనక నిజమైతే నేను ముమ్మాటికీ మహాపరాధినే. ఇంతపెద్ద అసత్యాన్ని కల్పించినందుకు అల్లాహ్ నన్ను వదలిపెట్టడు. ఒకవేళ అదేగనక జరిగితే అప్పుడనుకోండి– నేను నిజంగానే అసత్యవాదినని! మీరు నాకు సాయం చేయాల్సిన

شَهِيدًا بَيْنِي وَبَيْنَكُمْ ۖ وَهُوَ الْغَفُورُ الرَّحِيمُ ⑧

గురించి చెప్పే లేక వినే విషయాలన్నీ అల్లాహ్‌కు బాగా తెలుసు.[10] మీకూ – నాకూ మధ్య సాక్షిగా ఆయన ఒక్కడే చాలు.[11] ఆయన క్షమించేవాడు, దయ చూపేవాడు.[12]

قُلْ مَا كُنتُ بِدْعًا مِّنَ الرُّسُلِ وَمَا أَدْرِي مَا يُفْعَلُ بِي وَلَا بِكُمْ ۖ
إِنْ أَتَّبِعُ إِلَّا مَا يُوحَىٰ إِلَيَّ وَمَا أَنَا إِلَّا نَذِيرٌ مُّبِينٌ ⑨

**9** వారికి చెప్పు : "నేను కొత్తగా వచ్చిన ప్రవక్తనేమీ కాను.[13] (రేపు) నా పట్లా, మీ పట్లా జరిగే వ్యవహారం ఎలాంటిదో కూడా నాకు తెలీదు.[14] నా వద్దకు పంపబడిన సందేశాన్ని (వహీని) మాత్రమే నేను అనుసరిస్తాను. నేను చాలా స్పష్టంగా హెచ్చరించే వాణ్ణి మాత్రమే."

అవసరం కూడా లేదు. అలాంటి పరిస్థితుల్లో నన్ను అల్లాహ్ పట్టునుంచి కాపాడే శక్తి కూడా మీకు లేదు సుమా! ఈ విషయమే వేరొకచోట ఈ విధంగా చెప్పబడింది: "ఒకవేళ అతను మా గురించి తనంతట తానుగా ఏదైనా విషయం కల్పించుకుంటే, మేమతని కుడిచేతిని పట్టుకునేవారము. మరి అతని గొంతునాళం కోసివేసేవాళ్ళం. మరి మీలో ఎవరూ నన్ను అడ్డుకోలేకపోయేవాడు" (అల్ హాఖ్ఖ : 44 – 47).

10. అంటే – మీరెన్ని విధాలుగా ఈ ఖుర్‌ఆన్‌ని ధిక్కరిస్తున్నారో అల్లాహ్‌కు తెలియకుండా లేదు. ఒక్కోసారి మీరు దీన్ని ఇంద్రజాలం అంటారు. ఒక్కోసారి కట్టుకథ అని కొట్టిపారేస్తారు. మీ మాటలన్నింటినీ అల్లాహ్ గమనిస్తూనే ఉన్నాడు. నిందార్హమైన మీ చేష్టలకు తగిన శాస్తి ఆయనే చేస్తాడు.

11. ఈ ఖుర్‌ఆన్ గ్రంథం ఆయన తరఫునే అవతరించిందన్న విషయానికి ఆయన స్వయంగా సాక్షిగా ఉన్నాడు. మీ ధిక్కార వైఖరికి కూడా ఆయనే సాక్షి. ఈ పలుకుల్లో అవిశ్వాసులకు తీవ్రమయిన హెచ్చరిక ఉంది.

12. అంటే పశ్చాత్తాపం చెందిన వారి పాలిట, విశ్వసించిన వారిపట్ల, దివ్య ఖుర్‌ఆన్‌ను సత్యవాక్కుగా అంగీకరించిన వారిపట్ల అల్లాహ్ క్షమాశీలి. దీని భావం ఏమిటంటే ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు, మీరు గనక నిజమైన పశ్చాత్తాపం చెందినట్లయితే ఆయన మిమ్మల్ని మన్నించి, కరుణిస్తాడు.

13. అంటే – నేను తొలిప్రవక్తనూ కాను, నా ప్రవక్తాపదవి ఆశ్చర్యకర విషయమూ కాదు. నాకన్నా ముందు ఎందరో ప్రవక్తలు వచ్చారు, నాలాగే వారు కూడా దైవవాణిని అందజేశారు.

14. అంటే ప్రపంచంలో రేపు ఏం జరగనున్నదో నాకు తెలీదు, నేను మక్కా నగరంలోనే

قُلْ أَرَءَيْتُمْ إِن كَانَ مِنْ عِندِ ٱللَّهِ وَكَفَرْتُم بِهِۦ وَشَهِدَ شَاهِدٌ
مِّنۢ بَنِىٓ إِسْرَٰٓءِيلَ عَلَىٰ مِثْلِهِۦ فَـَٔامَنَ وَٱسْتَكْبَرْتُمْ إِنَّ ٱللَّهَ
لَا يَهْدِى ٱلْقَوْمَ ٱلظَّٰلِمِينَ ﴿١٠﴾

**10** (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : "చూడండి! ఒకవేళ ఇది (ఈ ఖుర్ఆన్) అల్లాహ్ తరఫునుంచే వచ్చి ఉండి, మీరు దాన్ని తిరస్కరించినట్లయితే ఇస్రాయీలు సంతతికి చెందిన ఒక సాక్షి ఇలాంటి (ఒక గ్రంథానికి) సాక్ష్యాన్ని కూడా ఇచ్చి, అతను విశ్వసించి ఉండగా మీరు మాత్రం అహంకారం ప్రదర్శిస్తే[15] (మీ గతేమవుతుందో ఆలోచించారా?) నిశ్చయంగా అల్లాహ్ దుర్మార్గులకు సన్మార్గం చూపడు."

ఉంటానో లేక ఇక్కడినుంచి మరోచోటికి ప్రస్థానం చేస్తానో, నాకు సహజ మరణం వస్తుందో లేక మీ చేతుల్లో చంపబడతానో కూడా నాకు తెలీదు. మీరు తొందరగా శిక్షించబడతారో లేక మీకు సుదీర్ఘగడువు ఇవ్వబడుతుందో నేను చెప్పలేను. ఈ విషయాలన్నీ ఒక్క అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. అయితే పరలోకంలో ఏం జరగనున్నదనే విషయానికి సంబంధించి మాత్రం చెప్పగలను – విశ్వాసులు స్వర్గానికి పోతారనీ, అవిశ్వాసులు నరకానికి ఆహుతి అవుతారనీని.

హదీసు ప్రకారం కొంతమంది సహచరులు మరణించినపుడు వారి గురించి కొందరు మంచి ఊహాగానం చేయగా దైవప్రవక్త (సఅసం) ఇలా అన్నారు: "దైవసాక్షి! నేను దైవప్రవక్త అయినప్పటికీ (తీర్పుదినాన) మీపట్లా – నాపట్లా ఏవిధమైన వ్యవహారం జరుగుతుందో నాకు తెలీదు" (సహీహ్ బుఖారీ – మనాఖిబుల్ అన్సార్). దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే ఫలానా వ్యక్తి పర్యవసానం ఖచ్చితంగా ఇలా ఉంటుందన్న సంగతి ఆయన (స)కు సయితం తెలీదు. కాకపోతే దేవుడు తెలియజేసిన వారి విషయంలో తప్ప! ఉదాహరణకు: పదిమంది సహాబీల గురించి, బద్ర్ యుద్ధంలో పాల్గొన్న సహచరుల గురించి ఆయన (స) ద్వారా స్వర్గలోక శుభవార్త ఇవ్వబడింది.

15. ఇంతకీ ఇస్రాయీల్ సంతతికి చెందిన ఆ సాక్షి ఎవరు? విశ్వసించిన ప్రతి ఇస్రాయీలు వంశీయునికి ఇది వర్తిస్తుందని కొందరు అభిప్రాయపడ్డారు. మక్కాలో నివసించే ఒకానొక ఇస్రాయీలు వ్యక్తి నుద్దేశించి ఈ వాక్యం అవతరించిందనీ, ఎందుకంటే ఈ సూరా మక్కాలో అవతరించిన సూరా అనీ మరి కొంతమంది విద్వాంసులు పేర్కొన్నారు. ఇంకా కొంతమంది విద్వాంసులు మాత్రం, అబ్దుల్లా బిన్ సలాం నేపథ్యంలో ఈ ఆయతు అవతరించిందని భావిస్తూ, దీన్ని మదనీ ఆయతుగా ఖరారు చేశారు. బుఖారీ, ముస్లింలలోని ప్రామాణిక హదీసు ద్వారా కూడా ఈ అభిప్రాయానికి సమర్థన లభిస్తోంది. (సహీహ్ బుఖారీ – మనాఖిబుల్ అన్సార్; ముస్లిం –

وَقَالَ الَّذِينَ كَفَرُوا لِلَّذِينَ آمَنُوا لَوْ كَانَ خَيْرًا مَّا سَبَقُونَا إِلَيْهِ ۚ وَإِذْ لَمْ يَهْتَدُوا بِهِ فَسَيَقُولُونَ هَٰذَا إِفْكٌ قَدِيمٌ ﴿١١﴾

**11** అవిశ్వాసులు విశ్వసించిన వారిను ద్దేశించి, "ఒకవేళ ఇది (ఈ ధర్మం) గనక శ్రేయస్కరమైనదై ఉంటే వీళ్లు మాకన్నా ముందు దీని వైపుకు వెళ్ళి ఉండేవారు కారు" అని అంటున్నారు. వారెలాగూ ఈ గ్రంథం ద్వారా సన్మార్గం పొందలేదు. అందువల్ల 'ఇదొక పాత అబద్ధం' అని కొట్టిపారేస్తారు.[16]

وَمِن قَبْلِهِ كِتَابُ مُوسَىٰ إِمَامًا وَرَحْمَةً ۚ وَهَٰذَا كِتَابٌ مُّصَدِّقٌ لِّسَانًا عَرَبِيًّا لِّيُنذِرَ الَّذِينَ ظَلَمُوا وَبُشْرَىٰ لِلْمُحْسِنِينَ ﴿١٢﴾

**12** దీనికి పూర్వం మూసా గ్రంథం సారథిగా, కారుణ్యంగా ఉండేది. కాగా; ఈ గ్రంథం దాన్ని ధృవీకరించేదిగా అరబీ భాషలో ఉన్నది. దుర్మార్గులను హెచ్చరించటానికి, సద్వర్తనులకు శుభవార్త ఇవ్వటానికి!

ఫజాయెలుస్సహాబా). అందుకే ఇమామ్ షౌకానీ ఈ అభిప్రాయం వైపుకే మొగ్గారు. **'అలా మిస్‌లిహీ'** ( عَلَىٰ مِثْلِهِ ) అంటే అటువంటి గ్రంథం గురించిన సాక్ష్యం అని భావం. అంటే తౌరాతు గ్రంథం అన్నమాట. ఎందుకంటే దివ్య ఖుర్ఆన్ కూడా తౌరాతు మాదిరిగానే దైవగ్రంథం. ప్రజలను ఏకదైవారాధన వైపు పిలిచే గ్రంథం. గ్రంథవహులు అయిన ప్రజలు సయితం దివ్య ఖుర్ఆన్‌ను విశ్వసించిన మీదట, ఇక ఇది దైవగ్రంథం అయివుండే విషయంలో సందేహానికి తావే లేకుండా పోయింది. అందువల్ల – ఇదంతా కళ్లారా చూస్తూ కూడా మీరు నిరాకరించటంలో, పంతాలకు పోవటంలో అర్థమేలేదు. మీ మంకుతనం ఎటువంటి దుష్పరిణామానికి దారితీస్తుందో బాగా ఆలోచించుకోండి.

16. హజ్రత్ బిలాల్, అమ్మార్, సుహైబ్, ఖబ్బాబ్ (ర.అన్హుం) వంటి పేద, బలహీన వర్గాల వ్యక్తులు ఇస్లాం స్వీకరణలో ముందంజ వేయటం మక్కా అవిశ్వాసులకు గిట్టలేదు. అందువల్ల వారి దృష్టిలో ఇస్లాం ధర్మానికి ప్రాముఖ్యం తగ్గిపోయింది. ఒకవేళ నిజంగానే ఇస్లాం ధర్మంలో మేలు ఉండివుంటే దాన్ని మాలాంటి ప్రముఖులు, మర్యాదస్తులు ప్రప్రథమంగా దాన్ని అవలంబించాల్సింది. ఈ బడుగువర్గాల వారు దాని వైపుకు మొగ్గారంటే బహుశా అదొక పాత చింతకాయ పులుసు అయి ఉంటుంది – ఇదీ ఈ బడా ఆసాముల ఆలోచనా ధోరణి!

ఈ గర్వాహంకారంతో వారు ఏకంగా దివ్య ఖుర్ఆన్‌నే 'పాత అబద్ధం'గా ఖరారు

إِنَّ الَّذِينَ قَالُوا رَبُّنَا اللَّهُ ثُمَّ اسْتَقَامُوا فَلَا خَوْفٌ عَلَيْهِمْ
وَلَا هُمْ يَحْزَنُونَ ﴿١٣﴾

**13** ఎవరయితే 'మా ప్రభువు అల్లాహ్‌యే' అని పలికి, తర్వాత దానిపై గట్టిగా నిలబడ్డారో వారికెలాంటి భయంగానీ, దుఃఖంగానీ లేదు.

أُولَٰئِكَ أَصْحَابُ الْجَنَّةِ خَالِدِينَ فِيهَا جَزَاءً بِمَا كَانُوا
يَعْمَلُونَ ﴿١٤﴾

**14** వారే స్వర్గవాసులు. వారందులో కల కాలం ఉంటారు. వారు చేసుకున్న కర్మలకు ప్రతిఫలం (ఇది).

وَوَصَّيْنَا الْإِنسَانَ بِوَالِدَيْهِ إِحْسَانًا حَمَلَتْهُ أُمُّهُ كُرْهًا
وَوَضَعَتْهُ كُرْهًا وَحَمْلُهُ وَفِصَالُهُ ثَلَاثُونَ شَهْرًا حَتَّىٰ إِذَا بَلَغَ

**15** మేము మనిషికి, తన తల్లిదండ్రుల యెడల ఉత్తమరీతిలో వ్యవహరించవలసినదిగా తాకీదు చేశాము. అతని తల్లి బాధను భరిస్తూ గర్భంలో అతన్ని మోసింది. బాధను భరిస్తూనే అతన్ని ప్రసవించింది.[17] అతన్ని గర్భంలో మోయటానికి, అతని పాలు విడిపించటానికి ముప్ఫై మాసాల కాలం పట్టింది.[18]

చేశారు ఒక్కోసారి ఖుర్‌ఆన్ అంశాలను 'పూర్వీకుల కట్టుకథలు'గా కూడా అభివర్ణించేవారు. యదార్థానికి ఒక వ్యక్తి ధనవంతుడు, పలుకుబడి కలవాడై ఉన్నంతమాత్రాన అతను దైవసన్నిధిలో ఎంతో ఆదరణీయుడు అని భావం ఎంతమాత్రం కాదు. (వాస్తవం ఏమిటంటే షైతాన్ వారిని అలాంటి భ్రమలకు లోను చేశాడు) అసలు మనిషి దైవసన్నిధిలో గౌరవాదరణలకు నోచుకోవాలంటే అతను దైవాన్ని విశ్వసించాలి, మంచి పనులు చేయాలి. ఈ భాగ్యాన్ని అల్లాహ్ తాను కోరిన వారికి ప్రసాదిస్తాడు. ఇక సిరిసంపదలంటారా, సిరిసంపదలను కలిగి ఉండటం తప్పు కాదు. కాని వాటిని దేవుడు పరీక్షించే నిమిత్తం ప్రసాదించాడని మరువరాదు.

17. తల్లిదండ్రుల యెడల మంచిగా మెలగమని తాకీదు చేసే సందర్భంగా తల్లిపడిన కష్టాలను ప్రత్యేకించి నొక్కిచెప్పటం గమనించదగిన విషయం. దీన్నిబట్టి సద్వ్యవహారం విషయంలో తండ్రికన్నా తల్లిస్థానం మరింత ఉన్నతమైందని తెలుస్తోంది. ఎందుకంటే మనిషిని ఉనికిలోకి తేవటంలో తండ్రి ప్రమేయం కొన్ని క్షణాలది లేక కొన్ని కణాలది మాత్రమే. కాని నవమాసాల పాటు ఆ నలుసును కడుపులో మోసుకుంటూ తిరగటం, పురిటి నొప్పుల్ని భరించటం, పీడనపై పీడనను భరిస్తూ అతన్ని కనటం, ఆ తరువాత శిశువును సాకటం, పాలుపట్టడం – ఇదంతా తల్లికే చెల్లింది! అందుకే తండ్రికన్నా తల్లికి ప్రాథమ్యం ఇవ్వబడింది. తండ్రి స్థానం రెండవది. హదీసు ద్వారా తెలిసేది

أَشُدَّهُ وَبَلَغَ أَرْبَعِينَ سَنَةً قَالَ رَبِّ أَوْزِعْنِيٓ أَنْ أَشْكُرَ نِعْمَتَكَ
الَّتِيٓ أَنْعَمْتَ عَلَيَّ وَعَلَىٰ وَالِدَيَّ وَأَنْ أَعْمَلَ صَالِحًا تَرْضَاهُ
وَأَصْلِحْ لِي فِي ذُرِّيَّتِيٓ ۖ إِنِّي تُبْتُ إِلَيْكَ وَإِنِّي مِنَ الْمُسْلِمِينَ ﴿١٥﴾

తుదకు అతను పూర్తి పరిపక్వతకు, అంటే నలభై ఏళ్లప్రాయానికి చేరుకున్నప్పుడు[19] ఇలా విన్నవించుకున్నాడు : "నా ప్రభూ! నీవు నాపై, నా తల్లిదండ్రులపై కురిపించిన అనుగ్రహ భాగ్యాలకుగాను కృతజ్ఞతలు తెలుపుకునే, నీ ప్రసన్నతను చూరగొనే విధంగా సత్కార్యాలు చేసే సద్బుద్ధిని నాకు ప్రసాదించు. ఇంకా నా సంతానాన్ని కూడా సజ్జనులుగా తీర్చిదిద్దు. నేను నీ వైపునకే మరలుతున్నాను. నేను నీ విధేయులలో ఒకణ్ణి."[20]

కూడా ఇదే. "నా సద్వ్యవహారానికి అందరికన్నా ఎక్కువ హక్కుదారులెవర"ని ఒక సహచరుడు ప్రశ్నించినపుడు "నీ తల్లి" అని దైవప్రవక్త (స) సమాధానమిచ్చారు. రెండవసారి ప్రశ్నించినపుడు కూడా ఆయన (స) అదే సమాధానమిచ్చారు. మూడవ సారి కూడా అదే సమాధానం. నాల్గవసారి ప్రశ్నించినపుడు మాత్రం "నీ తండ్రి" అని బదులిచ్చారు. (సహీహ్ ముస్లిం – కితాబుల్ బిర్ర్).

18. **'ఫిసాల్'** అంటే పాలు విడిపించటం అని అర్థం. పాలగడువు రెండేళ్లు (24 మాసాలు). దీని ఆధారంగా ఏ గర్భవతి అయినా ఆరుమాసాల తరువాత బిడ్డను ప్రసవించే అవకాశం ఉంటుందని ధర్మవేత్తలు నిర్ధారించారు. ఏ స్త్రీ అయినా వివాహమైన ఆరు మాసాలలో ప్రసవిస్తే అట్టి సంతానాన్ని అక్రమ సంతానంగా పరిగణించటానికి వీల్లేదు. ఎందుకంటే రెండేళ్లదాకా పాలు పట్టాలని ఖుర్ఆన్ ద్వారా (లుఖ్మాన్ సూరా–14, అల్ బఖర సూరా–233) విదితమవుతున్నది. దీని ప్రకారం గర్భవతి 6 మాసాల తరువాత ఎప్పుడైనా ప్రసవించే అవకాశం ఉంటుంది.

19. సాధారణంగా మనిషి 18 ఏళ్లకే యౌవన దశకు చేరుకుంటాడు. అయితే 40 ఏళ్ళప్రాయానికి చేరుకునే సరికి అతను పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని సంతరించుకుంటాడు. అతని పంచేంద్రియాలు పరిపక్వత చెందుతాయి. అందుకే ప్రతి ప్రవక్తకు నలభై ఏండ్ల తరువాతే ప్రవక్త పదవి లభించిందని ఖుర్ఆన్ వ్యాఖ్యాతలు అభిప్రాయపడ్డారు (ఫత్హుల్ ఖదీర్).

20. నలభై ఏండ్లకు చేరుకున్న పిదప మనిషి అత్యధికంగా ఈ విధంగా ప్రార్థిస్తూ ఉండాలని విద్వాంసులు – ఈ ఆయతు ఆధారంగా – వ్యాఖ్యానించారు. ఈ ఆయతులో మూడు ముఖ్యాంశాలున్నాయి : 1. తల్లిదండ్రుల (వారు జీవించి ఉంటే) సేవచేసి, దేవుని మెప్పు పొందే సద్బుద్ధిని ప్రసాదించమని కోరటం. 2. సత్కార్యాలు చేసే సద్బుద్ధి

**16** ఇలాంటి వారి సత్కార్యాలనే మేము స్వీకరిస్తాము. వారి తప్పులను క్షమిస్తాము. వారికి చేయబడిన సత్య వాగ్దానం ప్రకారం వారు స్వర్గవాసులలో ఉంటారు.

أُولَٰئِكَ الَّذِينَ نَتَقَبَّلُ عَنْهُمْ أَحْسَنَ مَا عَمِلُوا وَنَتَجَاوَزُ عَن سَيِّئَاتِهِمْ فِي أَصْحَابِ الْجَنَّةِ ۖ وَعْدَ الصِّدْقِ الَّذِي كَانُوا يُوعَدُونَ ١٦

**17** మరెవరయితే తన తల్లిదండ్రులతో, "ఛీ, (నేను మీతో విసిగివేసారి పోయాను).[21] నేను చచ్చాక మళ్లీ లేప బడతాననే మీరు (పద్దాకా) చెబుతూ ఉంటారా ఏమిటి?! నాకు పూర్వం కూడా ఎన్నో తరాలు గతించాయి, తెలుసా?![22]" అని అంటాడో, అతనికి సమాధానంగా వారిద్దరూ (తల్లిదండ్రులు) అల్లాహ్ సహాయం వేడుకుంటూ, "నీ పాడుగాను! ఒరేయ్ నువ్వు విశ్వసించరా! అల్లాహ్ వాగ్దానం తప్పకుండా నిజమవుతుందిరా" అని అంటారు. దానికతను "ఇవన్నీ పూర్వీకుల పసలేని గాథలు"[23] అంటాడు.

وَالَّذِي قَالَ لِوَالِدَيْهِ أُفٍّ لَّكُمَا أَتَعِدَانِنِي أَنْ أُخْرَجَ وَقَدْ خَلَتِ الْقُرُونُ مِن قَبْلِي وَهُمَا يَسْتَغِيثَانِ اللَّهَ وَيْلَكَ آمِنْ إِنَّ وَعْدَ اللَّهِ حَقٌّ فَيَقُولُ مَا هَٰذَا إِلَّا أَسَاطِيرُ الْأَوَّلِينَ ١٧

నొసగమని కోరటం. 3. తాను నికార్సయిన దైవవిధేయుణ్ణి అన్న విషయాన్ని పదే పదే నెమరు వేసుకోవటం.

21. ఇంతకుముందు ఆయతులలో సజ్జన సంతానం వ్యవహారశైలి ప్రస్తావించబడింది. దానికి భిన్నంగా దౌర్భాగ్యులైన పిల్లలు తమ తల్లిదండ్రుల యెడల ఎలా దురుసుగా వ్యవహరిస్తారో ఇక్కడ చెప్పబడింది. **'ఉఫ్ఫిల్లకుమా'** ( أُفٍّ لَّكُمَا ) అనే పదం ఈసడించు కోవటం, ఛీత్కరించటం, తీవ్రమైన అసహనాన్ని వ్యక్తపరచటం అన్నభావంలో ఉపయోగించబడుతుంది. అంటే దౌర్భాగ్యులు, దుర్మార్గులు అయిన కొడుకులు తమ మాతా పితలు చెప్పే శ్రేయస్కరమైన ఉపదేశాలను గౌరవించకపోగా, వారిపై కోపాన్ని, విసుగును వ్యక్తపరుస్తారు. అదేమంటే, "మీ చాదస్తాన్ని ఇక చాలించండి" అని దబాయిస్తారు. పిల్లలు ఎట్టి పరిస్థితిలోనూ ఈ విధంగా ప్రవర్తించేందుకు ఇస్లాం ధర్మం అనుమతించదు. ఈ ఆయతు సర్వసాధారణమైనది. అవిధేయులైన సంతానం అందరికీ ఈ ఆదేశం వర్తిస్తుంది.

22. వారిలో ఎవరూ మళ్లీ బ్రతికి ఈ లోకంలోకి రాలేదు అని వాడు చెప్పదలిచాడు. వాస్తవానికి మరణానంతర జీవితమనేది ప్రళయదినానికి (పరలోకానికి) సంబంధిం చినదే గాని ఇహలోకానికి సంబంధించినది కాదు.

**18** వీళ్లపైనే (అల్లాహ్ శిక్ష అవతరిస్తుందనే) వాక్కు రూఢీ అయింది.[24] వీరికి పూర్వం గతించిన జిన్నాతుల, మానవుల వర్గాలలోనే వీరు కూడా చేరిపోతారు.[25] నిస్సందేహంగా వీళ్లంతా నష్టపోయేవారే.

أُولَٰٓئِكَ الَّذِينَ حَقَّ عَلَيْهِمُ الْقَوْلُ فِىٓ أُمَمٍ قَدْ خَلَتْ مِن قَبْلِهِم
مِّنَ الْجِنِّ وَالْإِنسِ ۖ إِنَّهُمْ كَانُوا۟ خَٰسِرِينَ ﴿١٨﴾

**19** ప్రతి ఒక్కరికీ వారి వారి కర్మలను బట్టి తరగతులు లభిస్తాయి[26] – వారి ఆచరణలకుగాను సంపూర్ణ ప్రతిఫలం లభించటానికి (ఈ తరగతులు నిర్ధారించబడ్డాయి). వారికి ఏ విధమైన అన్యాయం కూడా జరగదు.[27]

وَلِكُلٍّ دَرَجَٰتٌ مِّمَّا عَمِلُوا۟ ۖ وَلِيُوَفِّيَهُمْ أَعْمَٰلَهُمْ وَهُمْ
لَا يُظْلَمُونَ ﴿١٩﴾

**20** అవిశ్వాసులు నరకాగ్ని ముందుకు తీసుకురాబడిన రోజున[28] (వారితో ఇలా అనబడుతుంది:) మీరు మీ మంచి మంచి

وَيَوْمَ يُعْرَضُ الَّذِينَ كَفَرُوا۟ عَلَى النَّارِ أَذْهَبْتُمْ طَيِّبَٰتِكُمْ
فِى حَيَاتِكُمُ الدُّنْيَا وَاسْتَمْتَعْتُم بِهَا فَالْيَوْمَ تُجْزَوْنَ عَذَابَ

23. తల్లిదండ్రులు ముస్లింలై ఉండి, వారి పిల్లలేమో అవిశ్వాసులో, నాస్తికులో అయివుంటే ఇలాంటి గొడవలే వస్తాయి. వారిమధ్య అవాంఛనీయమైన సంవాదన జరుగుతుంది. దీనికి ఈ ఆయతు ఒక ప్రబల తార్కాణం.

24. ఇలా జరగనున్నదని అల్లాహ్‌కు ముందు నుంచే తెలుసు. లేదా షైతాన్ సవాలుకు అల్లాహ్ ఈ విధంగా సమాధానం ఇచ్చాడు. ఉదాహరణకు అల్లాహ్ ఒకచోట షైతాన్‌ను ఉద్దేశించి, "నిన్ను అనుసరించే వారందరినీ నరకంలో పడేసి దాన్ని నింపేస్తాను" అన్నాడు (సాద్– 85).

25. అంటే వీళ్లూ ఆ అవిశ్వాస వర్గాలలో చేరిపోయారు. ప్రళయదినాన వీళ్లు చాలా తీవ్రమైన నష్టానికి గురవుతారు.

26. విశ్వాసులైనా, అవిశ్వాసులైనా – ఇరువురికీ వారి ఆచరణలనుబట్టి దైవసన్నిధిలో ప్రతిఫలం దొరుకుతుంది. విశ్వాసులు ఉన్నత తరగతులను పొందగా, అవిశ్వాసులు నరకంలోని అట్టడుగు స్థానాలకు నెట్టివేయబడతారు.

27. అపరాధికి అతని నేరానికి మించిన శిక్ష విధించబడదు. అలాగే సజ్జనులకు ఇవ్వవలసిన సత్ఫలితంలో ఎలాంటి కోత విధించబడదు. ప్రతి ఒక్కరికీ – మేలైనా, కీడైనా – వారు చేసుకున్న దాని ప్రకారం లభిస్తుంది.

28. అవిశ్వాసుల కళ్లపైనున్న చీకటి పొరలు తొలగించబడే ఆ రోజును కాస్త

الْهُوْنِ بِمَا كُنْتُمْ تَسْتَكْبِرُوْنَ فِى الْأَرْضِ بِغَيْرِ الْحَقِّ وَبِمَا كُنْتُمْ تَفْسُقُوْنَ ﴿٢٠﴾

వస్తువులను ప్రాపంచిక జీవితంలోనే పొందారు. వాటిని అక్కడే అనుభవించారు.[29] ఈ రోజు మీకు అవమానకరమైన శిక్ష విధించబడుతుంది. ఎందుకంటే మీరు భువిలో అకారణంగా అహంకారం ప్రదర్శించేవారు, ఆజ్ఞోల్లంఘనకు పాల్పడేవారు.[30]

وَاذْكُرْ اَخَا عَادٍ ۭ اِذْ اَنْذَرَ قَوْمَهٗ بِالْاَحْقَافِ وَقَدْ خَلَتِ

**21** మరి ఆద్ (జాతి) సోదరుడు తన జాతి వారిని ఇసుక గుట్టలవద్ద[31] హెచ్చరించిన

నెమరువేసుకోండి! వారు నరకాగ్నిని చాలా దగ్గర నుంచి చూస్తూ ఉంటారు. కొంతమంది వ్యాఖ్యాతలు **'యూరజు'** ( يُعْرَضُ ) అనే పదాన్ని **'యుఅజ్జబు'** (వారిని శిక్షించబడినప్పుడు) అన్న అర్థంలో తీసుకున్నారు. అయితే మరికొంతమంది అగ్ని వారి ముందుకు తేబడినపుడు అన్న భావంలో తీసుకున్నారు (ఫత్‌హుల్ ఖదీర్).

29. ఇక్కడ **'తయ్యిబాత్'** అంటే మానవులు ఎంతో ఇష్టపడి తినే త్రాగే ఆహార పదార్థాలు, ఎంతో కోరికతో ఉపయోగించుకునే వస్తువులు, వాటివల్ల ఎంతో ఆనందానుభూతిని పొందే దైవానుగ్రహాలు అని భావం. అయితే పరలోక చింతనతో వాటిని ఉపయోగిస్తే ఆ మాటేవేరు. దేవునిపై, పరలోకంపై ప్రగాఢ విశ్వాసం గల ఒక విశ్వాసి దైవానుగ్రహాలను తనివితీరా ఆస్వాదించే సమయంలో పరలోకాన్ని మరచిపోడు. తత్కారణంగా అతను అనుక్షణం దైవాజ్ఞకు లోబడి ఉంటాడు. అతని మనసు దేవుని పట్ల కృతజ్ఞతా భావంతో నిండిపోతుంది. కాని పరలోకచింతన లేని మనిషి ప్రవర్తన తద్భిన్నంగా ఉంటుంది. అతను తలబిరుసుగా, తిరుగుబాటుదారుగా మారిపోతాడు. ఆ విధంగా అతను దైవానికి కృతఘ్నుడు అవుతాడు. కాబట్టి ప్రాపంచిక జీవితంలో విశ్వాసి కృతజ్ఞతాపూర్వకంగా మసలుకున్నందుకు ప్రతిగా పరలోకంలో అతనికి అంతకన్నా మంచి స్థితి ప్రాప్తిస్తుంది. ఇంతకన్నా ఉత్తమ అనుగ్రహాలు వొసగబడతాయి.

కాగా; అవిశ్వాసుల పట్ల వ్యవహారం అందుకు విరుద్ధంగా ఉంటుంది. "ప్రాపంచిక సుఖభోగాలన్నింటినీ మీరు అనుభవించేశారు. ప్రయోజనమంతా అక్కడే పొందారు" అని వారితో అనబడుతుంది.

30. వారికి విధించబడే శిక్షకు ప్రధాన కారణాలు రెండు. ఒకటి : అకారణంగా అహంకారాన్ని, బడాయిని ప్రదర్శించటం. దీని మూలంగానే మనిషి సత్యం ముందు అణకువతో ఉండటానికి విముఖత చూపుతాడు. రెండు : అతిక్రమణా వైఖరి. తత్కారణంగా మానవుడు నిర్భయంగా, అడ్డూ ఆపూ లేకుండా పాపాలు చేస్తూ

النُّذُرُ مِنْ بَيْنِ يَدَيْهِ وَمِنْ خَلْفِهِ أَلَّا تَعْبُدُوا إِلَّا اللَّهَ إِنِّي أَخَافُ عَلَيْكُمْ عَذَابَ يَوْمٍ عَظِيمٍ ﴿٢١﴾

సంగతిని జ్ఞాపకం చేసుకో. అతనికి పూర్వం కూడా హెచ్చరిక చేసేవారు గడిచారు, అతని తరువాత కూడా. "మీరు అల్లాహ్‌ను తప్ప ఇతరులను పూజించకండి. ఒక మహానాడు మీపై విరుచుకుపడే శిక్ష గురించి నేను భయపడుతున్నాను"[32] (అని అతను హెచ్చరించాడు).

قَالُوا أَجِئْتَنَا لِتَأْفِكَنَا عَنْ آلِهَتِنَا فَأْتِنَا بِمَا تَعِدُنَا إِنْ كُنْتَ مِنَ الصَّادِقِينَ ﴿٢٢﴾

**22** దానికి వారు, "ఏమిటి, మమ్మల్ని మా దేముళ్ళ (పూజ) నుంచి మళ్ళించడానికేనా నువ్వు వచ్చింది?![33] ఒకవేళ నువ్వు సత్యవంతుడవే అయితే, ఏదీ నువ్వు మాతో వాగ్దానం చేసే ఆ ఆపదను మాపైకి తీసుకురా!" అని ఎద్దేవా చేశారు.

పోతాడు. తనను నిలదీసే వారెవరూ లేరన్నట్టుగా స్వైరవిహారం చేస్తాడు. ఈ రెండు విషయాలూ అవిశ్వాసులలో కలగలసి ఉంటాయి. కాబట్టి విశ్వాసులు (మోమిన్లు) తమ ప్రవర్తనలో ఈ రెండు దుర్గుణాలు పొడసూపకుండా తగు జాగ్రత్త వహించాలి.

**గమనిక :** దైవప్రవక్త సహచరులకు శ్రేష్ఠమైన ఆహారపదార్థాలు సమర్పించబడినప్పుడు వారిలో కొందరికి తక్కున ఈ ఆయతు జ్ఞాపకం వచ్చేది. వారు భయంతో వణికిపోయేవారు. రేపు ప్రళయదినాన ఈ ఆయతులో అనబడిన మాటే తమతో అనబడుతుందేమోనన్న భయంకొద్ది ఆ శ్రేష్ఠమైన ఆహారపదార్థాలు పుచ్చుకునేవారు కాదు. ఇది వారి పరిపూర్ణ భక్తీవిశ్వాసాలకు నిదర్శనం. అంతేగాని వారు శ్రేష్ఠమైన ఆహారపదార్థాలు తీసుకోవటాన్ని అధర్మంగా మాత్రం భావించేవారు కాదు.

31. 'అహ్‌ఖాఫ్' ( الْأَحْقَافِ ) అంటే ఎత్తయిన ఇసుక గుట్టలని అర్థం. కొంతమంది అనువాదకులు దీన్ని కొండలనీ, పర్వతగుహలనీ అనువదించారు. వీళ్లు దైవప్రవక్త హజ్రత్ హూద్ జాతికి చెందినవారు. వీరిని 'ఆదె ఊలా'గా వ్యవహరిస్తారు. ఇది వారి నివాస ప్రదేశం. అది హజర్‌మోత్ (యమన్ దేశం)కు సమీపంలో ఉన్నది. మక్కా అవిశ్వాసుల ధిక్కార వైఖరిని ఎదుర్కొంటున్న అంతిమ దైవప్రవక్త (స)కు ఓదార్పుగా ఇక్కడ గత ప్రవక్తల గాథలు ప్రస్తావించబడ్డాయి.

32. 'మహానాడు' ( يَوْمٍ عَظِيمٍ ) అంటే ప్రళయదినం అన్నమాట. ఆ దినపు భయానక దృశ్యాల కారణంగా దాన్నొక మహానాడుగా, విపత్కర దినంగా పేర్కొనటం జరిగింది.

**23** (హజ్రత్ హూద్) ఇలా అన్నాడు : “(దాని) జ్ఞానం అల్లాహ్ వద్దనే ఉంది. నేను మట్టుకు నాకిచ్చి పంపబడిన సందేశాన్ని మీకు అందజేస్తున్నాను.[34] కాని మీరు మాత్రం మూర్ఖజనంగా కనబడుతున్నారు.”[35]

قَالَ إِنَّمَا الْعِلْمُ عِندَ اللَّهِ وَأُبَلِّغُكُم مَّا أُرْسِلْتُ بِهِ وَلَٰكِنِّي أَرَاكُمْ قَوْمًا تَجْهَلُونَ ﴿٢٣﴾

**24** మరి వాళ్లు ఆ విపత్తును కారు మేఘం రూపంలో తమ లోయల వైపునకు రావటం చూసి, “ఇది మాపై వర్షాన్ని కురిపించే మబ్బు తునక”[36] అని చెప్పుకో సాగారు. కాదు, నిజానికది మీరు తొందరపెట్టిన (విపత్కర) మేఘం.[37] అదొక పెనుగాలి. అందులో వ్యధాభరితమైన శిక్ష ఉంది.[38]

فَلَمَّا رَأَوْهُ عَارِضًا مُّسْتَقْبِلَ أَوْدِيَتِهِمْ قَالُوا هَٰذَا عَارِضٌ مُّمْطِرُنَا ۚ بَلْ هُوَ مَا اسْتَعْجَلْتُم بِهِ ۖ رِيحٌ فِيهَا عَذَابٌ أَلِيمٌ ﴿٢٤﴾

33. అంటే మా దేవీదేవతల పూజ నుంచి మమ్మల్ని ఆపటానికి, మాన్పించడానికి వచ్చావా?!

34. **‘ఆ శిక్ష ఎప్పుడు?’** అన్నది నాకు తెలీదు. ఆ విషయం అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. ఆయన తన ప్రణాళిక ననుసరించి ఆ వ్యవహారాన్ని నిర్ణయిస్తాడు. నా బాధ్యతల్లా నాకప్పగించబడిన విషయాన్ని మీకు చేరవేయటం వరకే.

35. ఒకవైపున మీరు మీ అవిశ్వాస వైఖరిపై మొండికేయటమే గాకుండా, నా అధీనంలో లేని దానికోసం పదే పదే డిమాండు చేస్తున్నారు.

36. అప్పటికే చాలా కాలం నుంచి అక్కడ వర్షాలు లేవు. అలాంటిది ఒక్కసారిగా ఆకాశంలో కారుమబ్బులు క్రమ్ముకునేసరికి వారంతా ఆనందంతో ఎగిరిగంతేశారు. తమపై తొలకరి జల్లు పడబోతోందని అనుకున్నారు. మేఘాలు ఆకాశంలో విస్తరించి ఉంటాయి కనుక వాటిని **‘ఆరిజ్’** (عَارِضٌ) అని అనటం జరిగింది.

37. అప్పుడు దైవప్రవక్త లూత్ తన జాతివారినుద్దేశించి, “సంబరపడకండి. మీరంతా అనుకుంటున్నట్లుగా అది కారుణ్య మేఘం కానేకాదు. అది ఘోరకలిని సృష్టించే మబ్బుతునక! ఇంతకాలంగా మీరు తెగ హడావిడి చేసిన శిక్షా సంకేతం!!” అని హెచ్చరించారు.

38. ఆ పెనుగాలి ద్వారానే ఆద్ జాతి ఎడాపెడా ఊపివేయబడింది. దైవప్రణాళిక

**25** తన ప్రభువు ఆజ్ఞపై అది సర్వాన్నీ తుడిచిపెట్టేస్తుంది. అంతే! తెల్లవారేసరికి వారి నివాస గృహాలు తప్ప మరేమీ కనిపించలేదు.[39] అపరాధ జనులను మేము ఇలాగే దండిస్తాము.

تُدَمِّرُ كُلَّ شَيْءٍ بِأَمْرِ رَبِّهَا فَأَصْبَحُوا لَا يُرَىٰ إِلَّا مَسَاكِنُهُمْ ۚ كَذَٰلِكَ نَجْزِي الْقَوْمَ الْمُجْرِمِينَ ﴿٢٥﴾

**26** నిశ్చయంగా మేము వారికి (ఆదు జాతి వారికి), మీకు సయితం ఇవ్వని ఎన్నో శక్తియుక్తులను ఇచ్చాము. మేము

وَلَقَدْ مَكَّنَّاهُمْ فِيمَا إِن مَّكَّنَّاكُمْ فِيهِ وَجَعَلْنَا لَهُمْ سَمْعًا وَأَبْصَارًا وَأَفْئِدَةً فَمَا أَغْنَىٰ عَنْهُمْ سَمْعُهُمْ

ననుసరించి ఆ భయంకరమైన గాలి సర్వస్వాన్నీ తుడిచిపెట్టేసింది. అందుకే హదీసులో ఇలా అనబడింది – హజ్రత్ ఆయిషా (ర.అన్హా) దైవప్రవక్త (స)నుద్దేశించి, "జనులేమో మేఘాలను చూసినప్పుడు – వర్షం కురవబోతోందని – ఆనందంతో పరవశించి పోతుంటారాయె. కాని తమరి ముఖారవిందంపై ఆందోళనా ఛాయలు తొంగిచూస్తాయేమిటి?" అని ప్రశ్నించగా, "ఆయిషా ఆ మేఘాలలో ఆపద లేదన్న గ్యారంటీ ఏముందీ?! ఒకానొక జాతి ఈ పెనుగాలి ద్వారానే సర్వనాశనం చేయబడింది. ఆ జాతి వారు కూడా (ఇలాగే) ఆ మేఘాన్ని చూసి, 'ఇది మాపై వర్షించే మేఘం' అని మురిసిపోయారు" అని సమాధానమిచ్చారు (బుఖారీ – అల్ అహ్ఖాఫ్ సూరా వ్యాఖ్యానం; ముస్లిం–కితాబ్ సలాతుల్ ఇస్తిస్ఖా...) వేరొక ఉల్లేఖనం ప్రకారం గాలులు తీవ్రంగా వీస్తున్నప్పుడు మహాప్రవక్త (సఅసం) ఈ విధంగా వేడుకునేవారు: **"అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుక ఖైరహా. వ ఖైర మాఫీహా, వ ఖైర మా ఉర్సిలత్ బిహీ, వ అవూజుబిక మిన్ షర్రిహా వ షర్రి మా ఉర్సిలత్ బిహీ."** (ఓ అల్లాహ్! నేను దీని మంచిని, దీనిలో ఉన్న మంచిని కోరుకుంటున్నాను. ఏ మంచితోపాటు ఇది పంపబడిందో దాన్ని కోరుకుంటున్నాను. ఇంకా నేను దాని కీడు నుండి, ఏ కీడుతో పాటు అది పంపబడిందో దాని నుండి నేను నీ శరణు వేడుకుంటున్నాను). ఆకాశంలో కారుమబ్బులు క్రమ్ముకున్నప్పుడు ఆయన (స) ముఖకవళికలు కూడా మారిపోయేవి. ఒకలాంటి భయోత్పాతం ఆయన (స)పై ఆవరించేది. ఆయన వ్యాకులతకు లోనయ్యేవారు. ఒక్కోసారి బయటకు వచ్చేసేవారు. ఒక్కోసారి లోపలికి వెళ్ళేవారు. కొన్నిసార్లు ముందుకుపోయేవారు, కొన్నిసార్లు వెనక్కి తగ్గేవారు. వర్షం తగ్గాక ఆయన (స) మనసు కుదుటపడేది (సహీహ్ ముస్లిం – కితాబ్ సలాతుల్ ఇస్తిస్ఖా).

39. అంటే గృహవాసులంతా అంతమైపోయారు. గృహాలు మాత్రం మిగిలాయి – భావి తరాల వారికి గుణపాఠ సూచకంగా!

وَلَآ أَبْصَٰرُهُمْ وَلَآ أَفْـِٔدَتُهُم مِّن شَىْءٍ إِذْ كَانُوا۟
يَجْحَدُونَ بِـَٔايَٰتِ ٱللَّهِ وَحَاقَ بِهِم مَّا كَانُوا۟ بِهِۦ
يَسْتَهْزِءُونَ ﴿٢٦﴾

వారికి చెవులను, కళ్లను, హృదయాలను కూడా ప్రసాదించాము. కాని వారు అల్లాహ్ వాక్యాలను త్రోసిపుచ్చినప్పుడు వారి చెవులుగానీ, కళ్లుగానీ, వారి హృదయాలుగానీ వారికేవిధంగానూ ఉపకరించ లేదు.[40] వారు దేన్ని గురించి ఎగతాళి చేసే వారో చివరకు అదే వారిని చుట్టు ముట్టింది.[41]

وَلَقَدْ أَهْلَكْنَا مَا حَوْلَكُم مِّنَ ٱلْقُرَىٰ وَصَرَّفْنَا ٱلْءَايَٰتِ
لَعَلَّهُمْ يَرْجِعُونَ ﴿٢٧﴾

**27** మీ చుట్టుప్రక్కల ఉండే ఎన్నో జన వాసాలను మేము తుడిచిపెట్టేశాము.[42] వారు దారికి వస్తారేమోనన్న ఉద్దేశంతో మేము రకరకాలుగా మా సూచనలను వారికి వివరించాము.[43]

فَلَوْلَا نَصَرَهُمُ ٱلَّذِينَ ٱتَّخَذُوا۟ مِن دُونِ ٱللَّهِ قُرْبَانًا

**28** దైవ సామీప్యం పొందటానికి వారు – అల్లాహ్‌ను వదలి – ఆశ్రయించిన

40. మక్కా వారినుద్దేశించి చెప్పబడిన మాటలివి. మీరేపాటి? మీకు మునుపు మీకన్నా ఘనాపాటిగా ఉన్న జాతినే మేము మట్టుపెట్టేశాము. దైవప్రసాదితమైన శక్తులను (కళ్లు, చెవులు, హృదయాలు) వారు దుర్వినియోగపరచిన కారణంగా మేము వారిపై దంచివేసే ఆపదను తెచ్చాము. అప్పుడు వారి ప్రజ్ఞాపాటవాలుగానీ, వారి శక్తులు, సామర్థ్యాలుగాని వారిని ఆదుకోలేకపోయాయి.

41. ఏ విపత్కర సందర్భాన్ని వారు 'అసంభవం' అనుకుని వేళాకోళం చేసేవారో అది రానే వచ్చింది. వస్తూ వస్తూనే ఘోరకలిని సృష్టించింది. దాన్నుంచి బ్రతికి బట్టకట్టే మార్గాంతరమే వారికి లేకపోయింది.

42. చుట్టుప్రక్కల ఉండే జనవాసాలంటే ఆద్, సమూద్, లూత్ జాతివారి బస్తీలు. అవి హిజాజ్ క్షేత్రానికి ఎంతో దూరంలో లేవు. యమన్, పాలస్తీనా, సిరియా రాజ్యాలకు – వర్తకం నిమిత్తం – వస్తూపోతూ శిథిలావస్థలో ఉన్న ఆ పట్టణాలను వారు చూసేవారు.

43. అంటే – మేము పలు విధాలుగా వారికి మా నిదర్శనాలను చూపించాము. ఆ విధంగానయినా వారు సత్యాన్ని గ్రహించి క్షమాపణ కోరుకుంటారేమోనని ఆశించాము. కాని వారిలో ఎలాంటి పరివర్తనా రాలేదు.

اٰلِهَةًۢ ؕ بَلْ ضَلُّوْا عَنْهُمْ ۚ وَذٰلِكَ اِفْكُهُمْ وَمَا كَانُوْا
يَفْتَرُوْنَ ﴿٢٨﴾

దేముళ్లు వారినెందుకు ఆదుకోలేదు? పైగా వారు వీళ్లకు అస్సలు కనబడకుండా పోయారు. (నిజానికి) అది వారి అసత్యం, వారు కల్పించుకున్న అభూతకల్పన మాత్రమే.[44]

وَاِذْ صَرَفْنَآ اِلَيْكَ نَفَرًا مِّنَ الْجِنِّ يَسْتَمِعُوْنَ الْقُرْاٰنَ ۚ
فَلَمَّا حَضَرُوْهُ قَالُوْٓا اَنْصِتُوْا ۚ فَلَمَّا قُضِيَ وَلَّوْا اِلٰى قَوْمِهِمْ
مُّنْذِرِيْنَ ﴿٢٩﴾

**29** (ఓ ప్రవక్తా!) జిన్నుల సమూహం ఒకదానిని మేము ఖుర్ఆన్ వినేందుకు నీ వైపునకు పంపిన సంగతిని కాస్త మననం చేసుకో. వారు ప్రవక్త దగ్గరకు చేరుకున్నప్పుడు, "నిశ్శబ్దంగా వినండి"[45] అని (పరస్పరం) చెప్పుకున్నారు. మరి ఆ పారాయణం ముగియగానే,[46] తమ వర్గం వారిని హెచ్చరించటానికి వాళ్ల వద్దకు తిరిగివచ్చారు.

44. ఏ ఏ దేముళ్లను వారు ఆశ్రయించి, కష్టకాలంలో వారు తమను కాపాడతారని, దైవసామీప్యం పొందటానికి దోహదపడతారని తలపోశారో వారెవరూ అవసరానికి వారిని ఆదుకోలేదు. పైగా వారంతా – అక్కరకు రావలసిన క్షణాల్లోనే – కనుమరుగైపోయారు. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే మక్కాకు చెందిన ముష్రిక్కులు ఈ విగ్రహాలను 'దైవం'గా భావించేవారు కాదు. అయితే అవి తమను దైవసామీప్యానికి చేర్చటంలో కీలకపాత్ర పోషిస్తాయని గట్టిగా నమ్మేవారు. ఈ రకమయిన సాధనాన్ని (వసీలాను) అల్లాహ్ ఒక మిధ్యగా, ఒక స్వీయ కల్పనగా ఖరారు చేశాడు. దాన్ని అక్రమంగా, అధర్మంగా కూడా పేర్కొన్నాడు.

45. సహీహ్ ముస్లిం ఉల్లేఖనం ప్రకారం తెలిసేదేమిటంటే ఈ సంఘటన మక్కాకు సమీపంలో ఉన్న **'నఖలా'** లోయవద్ద దైవప్రవక్త (సఅసం) ఫజ్ర్ నమాజ్ చేయిస్తుండగా జరిగింది. అప్పటికే జిన్నుల వర్గాలెన్నో గగనతలంలో ఏర్పడిన అసాధారణ పరిస్థితికి కారణాలేమిటో తెలుసుకునేందుకు తిరుగుతున్నాయి. ఎందుకంటే జిన్నుల వర్గం తరచూ ఆకాశాలలోకి వెళ్ళి ఏదైనా కీలక సమాచారం దొరకబుచ్చుకునేందుకు తిప్పలు పడేవి. కాని ఈ మధ్య అవి ఊర్ధ్వలోకాల్లో సంచరించటం గగనమైపోయింది. దాంతో ఏదో అసాధారణ పరిస్థితి ఏర్పడిందని, భువిలో ముఖ్యమైన పరిణామం ఏదో జరిగిందని అనుమానించాయి. అదేమిటో తెలుసుకునే తాపత్రయంతోనే నేల నాలుగు చెరగులా గాలించేవి. ఒకానొక రోజు తెల్లవారుజామున ఒక జిన్నుల

قَالُوا يٰقَوْمَنَآ إِنَّا سَمِعْنَا كِتٰبًا أُنْزِلَ مِنْۢ بَعْدِ مُوسٰى مُصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيْهِ يَهْدِيٓ إِلَى الْحَقِّ وَإِلٰى طَرِيقٍ مُّسْتَقِيمٍ ﴿٣٠﴾

**30** వారిలా అన్నారు : "ఓ మా జాతి వారలారా! మూసా తరువాత అవతరింపజేయబడిన గ్రంథాన్ని మేము విన్నాము. అది తనకు పూర్వం ఉన్న దైవగ్రంథాలన్నింటినీ ధృవీకరిస్తోంది. ఇంకా – అది సత్యధర్మం వైపునకు, తిన్నని దారి వైపునకూ దర్శకత్వం వహిస్తోంది.

يٰقَوْمَنَآ أَجِيبُوا دَاعِيَ اللّٰهِ وَاٰمِنُوا بِهٖ يَغْفِرْ لَكُمْ مِّنْ ذُنُوبِكُمْ وَيُجِرْكُمْ مِّنْ عَذَابٍ أَلِيمٍ ﴿٣١﴾

**31** "ఓ మా జాతివారలారా! అల్లాహ్ వైపునకు పిలిచేవాని మాట వినండి. అతన్ని విశ్వసించండి.[47] అల్లాహ్ మీ పాపాలను మన్నిస్తాడు. బాధాకరమైన శిక్ష నుండి మిమ్మల్ని రక్షిస్తాడు.[48]

సమూహం దైవప్రవక్త (స)నోట ఖుర్‌ఆన్ వాణిని విని అప్పుడర్థం చేసుకొంది – గగనతలంలోని అత్యవసర స్థితికి అసలు కారణం ఏమిటో! దివ్య ఖుర్‌ఆన్‌ను వినగానే జిన్నుల ఆ సమూహం దైవప్రవక్త (స)ను విశ్వసించింది. అది తన జన సమూహంలోకి వెళ్ళి జరిగినదంతా పూసగుచ్చినట్లు వివరించింది. ఇస్లాంను స్వీకరించమని తమ వాళ్ళను కోరింది (ముస్లిం – కితాబుస్సలాత్. సహీహ్ బుఖారీలో కూడా కొన్ని విషయాలు ప్రస్తావనకు వచ్చాయి). మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం జిన్నుల ఆహ్వానంపై దైవప్రవక్త (సఅసం) ఆ వర్గం వద్దకు వెళ్ళి దైవసందేశం అందజేశారు. జిన్నుల బృందం కూడా పలుమార్లు ఆయన (స) దగ్గరకు వచ్చి ధర్మసందేహాలు నివృత్తి చేసుకునేది (ఫత్‌హుల్ బారీ, తఫ్సీర్ ఇబ్నె కసీర్).

46. అంటే, దైవప్రవక్త (సఅసం) తరపున ఖుర్‌ఆన్ పఠనం పూర్తి కాగానే....

47. అంటే, అంతిమ దైవప్రవక్త అయిన ముహమ్మద్ (స) దైవదౌత్యాన్ని విశ్వసించమని జిన్నుల ఆ సమూహం తన జాతివారిని కోరింది. అంతకుముందు దివ్య ఖుర్‌ఆన్ గురించి వారు తమ జాతి వారికి పరిచయం చేశారు.

48. 'విశ్వాసం' వల్ల పరలోకంలో కలిగే మేళ్లు ఇక్కడ చెప్పబడ్డాయి. **'మిన్ జునూబికుమ్'** (**مِّنْ ذُنُوبِكُمْ**) అంటే దేవుడు కొన్ని పాపాలను మన్నిస్తాడు. అవి దేవుని హక్కులకు సంబంధించినవి. దాసుల హక్కులు మాత్రం క్షమించబడవు. దీన్నిబట్టి అవగతమయ్యేదేమిటంటే ధర్మాధర్మాలు, పాపపుణ్యాల విషయంలో మనుషులకు వర్తించే ఆజ్ఞలే జిన్నులకు కూడా వర్తిస్తాయి.

మరయితే దేవుడు జిన్నుల వర్గంలో కూడా ప్రవక్తలను ప్రభవింపజేశాడా? లేదా?

32 అల్లాహ్ వైపు పిలిచేవాని మాట వినని వాడు భూమిలో ఎక్కడా (పారిపోయి అల్లాహ్‌ను) అలుపుకు గురిచేయలేడు.[49] అల్లాహ్ తప్ప అతనికి సాయపడేవారు కూడా ఎవరూ ఉండరు.[50] ఇలాంటి వారు స్పష్టమైన మార్గభ్రష్టతకు లోనై ఉన్నారు."

وَمَنْ لَّا يُجِبْ دَاعِيَ اللّٰهِ فَلَيْسَ بِمُعْجِزٍ فِي الْاَرْضِ وَلَيْسَ لَهٗ
مِنْ دُوْنِهٖٓ اَوْلِيَآءُ ۭ اُولٰۗىِٕكَ فِيْ ضَلٰلٍ مُّبِيْنٍ ۝۳۲

33 ఏమిటి, భూమ్యాకాశాలను సృష్టించిన అల్లాహ్, వాటిని సృష్టించటంలో ఏ విధం గానయితే అలసిపోలేదో అదే విధంగా ఆయన మృతులను తిరిగి బ్రతికించగల డని వారు చూడటం లేదా? అవును, ఆయన ప్రతిదీ చేయగల అధికారం కలవాడు.[51]

اَوَلَمْ يَرَوْا اَنَّ اللّٰهَ الَّذِيْ خَلَقَ السَّمٰوٰتِ وَالْاَرْضَ وَلَمْ يَعْيَ
بِخَلْقِهِنَّ بِقٰدِرٍ عَلٰٓي اَنْ يُّـحْيِۦ الْمَوْتٰى ۭ بَلٰٓي اِنَّهٗ عَلٰي كُلِّ
شَيْءٍ قَدِيْرٌ ۝۳۳

34 అవిశ్వాసులు నరకం వద్దకు తేబడిన రోజున, "ఏమిటి, ఇది సత్యం కాదా?!" (అని వారిని ప్రశ్నించటం జరుగుతుంది). "అవును. మా ప్రభువు సాక్షిగా! (ఇది

وَيَوْمَ يُعْرَضُ الَّذِيْنَ كَفَرُوْا عَلَي النَّارِ ۭ اَلَيْسَ هٰذَا بِالْحَقِّ ۭ قَالُوْا

అన్న విషయంలో పండితుల మధ్య అభిప్రాయభేదం ఉంది. దివ్య ఖుర్ఆన్ వచనాల ప్రకారం చూస్తే దైవప్రవక్తలు జిన్నుల నుంచి రాలేదని, మానవ సముదాయాలలో నుంచి మాత్రమే దైవప్రవక్తలు ఎన్నుకోబడ్డారని అర్థమవుతుంది. ఉదాహరణకు :

1. "(ఓ ప్రవక్తా!) నీకు పూర్వం కూడా మేము మానవమాత్రులనే (పురుషులనే) ప్రవక్తలుగా పంపిస్తూ వచ్చాము. వారివద్దకు సందేశాన్ని పంపేవారము." (అన్ నహ్లా – 43)

2. "మేము నీకు మునుపు పంపిన ప్రవక్తలంతా భోజనం కూడా చేసేవారు, అంగడు లలో కూడా సంచరించేవారు." (ఫుర్ఖాన్ – 20)

పై ఆయతుల ద్వారా బోధపడేదేమిటంటే దేవుని తరఫున పంపబడిన ప్రవక్తలందరూ మానవమాత్రులే. అందుకే అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) వారు మానవకోటి కోసం ఎలా ప్రవక్తగా ఉండేవారో అలాగే జిన్నుల సమూహం కోసం కూడా ప్రవక్తగా ఉండేవారు. జిన్నుల వరకూ దైవసందేశాన్ని అందజేసే బాధ్యత ఆయనపై మోపబడిందని ఖుర్ఆన్ హదీసుల ద్వారా విదితమవుతోంది.

49. అంటే – వారు భూమిలో దూరప్రాంతాలకు పారిపోయినంత మాత్రాన అల్లాహ్‌కు పట్టుబడకుండా ఉండరు.

సత్యమే” అని వారి నుంచి సమాధానం వస్తుంది).[52] “సరే! ఇప్పుడు మీ తిరస్కార వైఖరికి బదులుగా శిక్షను చవిచూడండి”[53] అనంటాడు (అల్లాహ్).

بَلٰى وَرَبِّنَا ۚ قَالَ فَذُوقُوا الْعَذَابَ بِمَا كُنتُمْ تَكْفُرُونَ ﴿٣٤﴾

**35** కనుక (ఓ ప్రవక్తా!) సాహసమూర్తులైన ప్రవక్తలు ఓపిక పట్టినట్లే నువ్వు కూడా ఓపిక పట్టు. వారి విషయంలో (శిక్ష కోసం) తొందరపెట్టకు.[54] వారికి వాగ్దానం చేయ బడుతున్న దానిని (శిక్షను) వారు కళ్ళారా చూసుకున్నప్పుడు, తాము (మహా అంటే) ఒక దినములోని ఒక గడియ మాత్రమే (ప్రపంచంలో) ఉండి ఉంటామని వారికి అనిపిస్తుంది.[55] ఇదీ (నీవు అందజేయ వలసిన) సందేశం![56] ఇక అవిధేయులు మాత్రమే సర్వనాశనం చేయబడతారు.[57]

فَاصْبِرْ كَمَا صَبَرَ أُولُو الْعَزْمِ مِنَ الرُّسُلِ وَلَا تَسْتَعْجِل لَّهُمْ ۚ
كَأَنَّهُمْ يَوْمَ يَرَوْنَ مَا يُوعَدُونَ لَمْ يَلْبَثُوا إِلَّا سَاعَةً مِّن
نَّهَارٍ ۚ بَلَاغٌ ۚ فَهَلْ يُهْلَكُ إِلَّا الْقَوْمُ الْفَاسِقُونَ ﴿٣٥﴾

50. అంటే దేవుడు విధించే శిక్షనుంచి వారతన్ని కాపాడలేరు. వారు స్వయంగానూ దేవుని పట్టునుంచి తప్పించుకోలేరు. ఇతరులను కూడా తప్పించలేరు.

51. ఇక్కడ **‘చూడటం’** అంటే మనోనేత్రంతో వీక్షించటం, ఆలోచించటం, ఊహించటం అని భావం. అంటే భూమ్యాకాశాలంతటి సువిశాల సృష్టికి మూలకారకుడైన దేవుడు, ఈ అపూర్వ సృష్టిలో అలుపూ సలుపూ ఎరుగనివాడు మృతులను తిరిగి బ్రతికించలేడా? ఈ మాత్రం విషయం వారి బుర్రకు ఎక్కటం లేదా? ముమ్మాటికీ ఆయన బ్రతికించ గలడు. ఎందుకంటే ఆయనకు సాధ్యం కానిదంటూ ఏదీ లేదు.

52. వారు కేవలం ఒప్పుకోవటమేకాదు, దేవునిపై ప్రమాణంచేసి మరీ దాన్ని సత్యమని ధృవీకరిస్తారు. కాని ఆ సమయంలో వారి ‘ఒప్పుకోలు’ వారికేవిధంగానూ ఉపకరిం చదు. ఎందుకంటే ఒక విషయాన్ని కళ్లారా చూసిన మీదట ధృవీకరించటం గొప్పేమీ కాదు. కళ్లతో వీక్షించిన తరువాత ఎవరయినా ఒప్పుకోక ఏం చేస్తారు? కాదంటారా ఏమిటి? చూడకుండానే ఒప్పుకుని ఉంటే ఆ ఒప్పుకోలు వారికి పనికివచ్చేది.

53. ఎందుకంటే మీరు ఒప్పుకోవలసిన క్షణంలో ఒప్పుకోలేదు. ఆనాటి మీ తిరస్కార వైఖరి పర్యవసానమే ఈ నరకయాతన. కాబట్టి అనుభవించండి.

54. మక్కా అవిశ్వాసుల కరకు వైఖరికి ప్రతిగా ఇక్కడ మహనీయ ముహమ్మద్ (సఅసం)ను ఓదార్చటం జరిగింది. ధైర్యం చెప్పటం జరిగింది. సహనంతో వ్యవహరించమని ఉపదేశించటం జరిగింది.

55. ప్రళయదినపు భయంకర దృశ్యాలను చూసినప్పుడు వారికి ఇలా అనిపిస్తుంది.

56. అంటే (ఓ ముహమ్మద్!) ఈ సందేశాన్ని అందజేయటం వరకే నీ బాధ్యత. మిగతాదంతా నాకు వదలిపెట్టు అని దేవుడు తన ప్రవక్తతో అంటున్నాడు.

57. ఈ చివరి వాక్యంలో కూడా విశ్వాసులకు శుభవార్త ఉంది. కాగా; ఈ వాక్యం అవిశ్వాసులకు, అవిధేయులకు, పాపాత్ములకు ఒక హెచ్చరిక అన్నమాట!